క్లుప్తంగా

వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం రాత్రి వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి, విన్నవించారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి మొదట విడత రూ.1.80 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. రూ.30 లక్షల కంట్రిబ్యూషన్ కడితే రెండో విడత మరో రూ.1.20 కోట్లు వచ్చేవన్నారు. కానీ, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ఆ మొత్తాన్ని చెల్లించని కారణంగా నిధులు రాలేదని పేర్కొన్నారు. మొదటి విడత నిధులతో పనులు చేపట్టేలా దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్‌తో మాట్లాడాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, లింగంగౌడ్, బండారి బాల్‌రెడ్డి, రాజేందర్, రామచంద్రం, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు ఈశ్వర్ తదితరులున్నారు.

విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ను కలిసిన నాయకులు



ఎల్లారెడ్డిపేట: తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా సుంకేటి అన్వేశ్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, వేములవాడ రాజరాజేశ్వర స్వామి చిత్రపటం, ప్రసాదం అందించారు. రైతులకు మెరుగైన సేవలందించాలని కోరారు. కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు హరిభూషణ్, గిరిధర్‌రెడ్డి, నందు, పద్మారెడ్డి, సాయి, లచ్చన్న, బాల్‌రాజు, శంకర్, భూపాల్‌రెడ్డి, సురేందర్ తదితరులున్నారు.

మెహందీ వేడుకలు



గంభీరావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం మెహందీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఆషాఢం గోరింటాకు-మెహందీ డిజైన్స్ కాంపిటేషన్ జరిపారు. 60 మంది విద్యార్థినులు పోటీలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ దాసు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ వాణి, అధ్యాపకులున్నారు.

ఏఎస్పీని కలిసిన సెస్ డైరెక్టర్




బోయినపల్లి: వేములవాడ సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డిని బోయినపల్లి మండల సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించారు. వేములవాడ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరానని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లికి చెందిన టేకు మల్లేశం(24) అదృశ్యమైనట్లు తండ్రి టేకు చంద్రయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ సోమవారం తెలిపారు. మల్లేశం రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి సైతం మద్యం తాగి ఇంటికొచ్చాడు. అతిగా తాగితే ఆరోగ్యం పాడవుతుందని మానేయాలని సూచించడంతో మానేస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబికులు తమకు తెలిసిన ప్రాంతాలతోపాటు బంధువులను అడిగారు. ఆచూకీ లభించకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టు



సిరిసిల్లక్రైం/సిరిసిల్లటౌన్: నిరుద్యోగుల సచివాలయ ముట్టడి నేపథ్యంలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకులను సిరిసిల్ల పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయిన బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్, నాయకులు రవిగౌడ్, ఎస్కే.బాబా, సాయి, దీపక్, వెంకటరమణ తదితరులు సిరిసిల్ల థానా ఎదుట ధర్నా చేపట్టారు. ప్రజాపాలన అని అధికారంలో వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులను, నిరుద్యోగుల విషయంలో అణచివేత ధోరణితో వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు తమను అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. డీఎస్సీని వాయిదా వేయాలని, గ్రూప్-2, 3 పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు.



సిరిసిల్లలో కురుస్తున్న వర్షం



సిరిసిల్ల పాత బస్టాండ్ సమీపంలో..



వేములవాడ రాజన్న ఆలయం వద్ద...

భారీ వర్షం.. జలమయం

సిరిసిల్లలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. అరగంటకు పైగా కురిసిన వర్షంలో జనం తడిసిముద్దయ్యారు. వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ఎప్పటిలాగే పాత బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారి చెరువును తలపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

వేములవాడలో..

వేములవాడ: ఉదయం నుంచి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన వేములవాడ పట్టణ ప్రజలు సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో కాస్త ఉపశమనం పొందారు. గంటపాటు కురిసిన వానతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రాజన్న భక్తులు వర్షంలోనే స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేట: మండలంలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. పాత ఇళ్లు, లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే వాళ్లను తహసీల్దార్ రామచంద్రం అప్రమత్తం చేశారు. ఈ వానతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

నిరసనలు.. సమస్యలపై వినతులు

- దద్దరిల్లిన కలెక్టరేట్
- కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తరలివచ్చిన బాధితులు
- ప్రజావాణిలో కలెక్టర్‌కు వేడుకోలు



కలెక్టరేట్ ఎదుట నిరస తెలుపుతున్న మాజీ సర్పంచులు

సిరిసిల్లటౌన్: జిల్లా కలెక్టరేట్ సోమవారం నిరసనలతో దద్దరిల్లింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజాసమస్యలు పరిష్కరించాలంటూ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నాయకులు, బాధితులు ధర్నాలు చేపట్టారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో ఉన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతిపత్రాలు అందించారు. సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు.

దయచేసి బిల్లులు చెల్లించండి

పెండింగ్ బిల్లులు దయచేసి చెల్లించాలని మాజీ సర్పంచులు ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచుల ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు వచ్చి, నిరసన తెలిపారు. 2019 నుంచి 2024 వరకు ఒక్కొక్కరికి రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికే అప్పుల బాధతో పలువురు మాజీ సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్, ప్రధాన కార్యదర్శి అజయ్య, ఉపాధ్యక్షురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీ డబ్బులు చెల్లించాలి

టెక్స్‌టైల్ పార్కులో పని చేస్తున్న నేత కార్మికులకు రావాల్సిన బతుకమ్మ చీరల యారన్ సబ్సిడీ డబ్బులు చెల్లించాలని పవర్‌లూమ్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ కోరారు. ప్రజావాణిలో వినతిపత్రం అందించి, మాట్లాడారు. గతంలో ఇచ్చినట్లుగా యారన్ సబ్సిడీ మీటర్‌కు రూ.1.42 పైసలు ఇవ్వాలన్నారు. పవర్‌లూమ్ షెడ్ల కోసం తీసుకున్న ప్లాట్లను వడ్ల గోదాములుగా మార్చినవారిపై చర్యలు తీసుకోవాలని, నిర్మాణం పూర్తయిన క్యాంటీన్‌ను వెంటనే ప్రారంభించాలని విన్నవించారు.



డబుల్‌బెడ్రూం కాలనీవాసులు..

ప్రొటోకాల్ పాటించడం లేదు..

జిల్లా పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించినప్పుడు అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి ఆరోపించారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు ఫిర్యాదు చేశారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, అందులో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫొటో పెట్టని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, నాయకులున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

జిల్లా కేంద్రం పరిధిలోని పెద్దూరు డబుల్‌బెడ్రూం కాలనీలో సమస్యలను అధికారులు ఏళ్లుగా పరిష్కరించడం లేదని స్థానికులు ఆరోపించారు. బోర్లు ఉండి, మోటార్లు లేక నీటి కరువొచ్చిందన్నారు. ప్రార్థనా మందిరాలకు స్థలాలివ్వాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, సిరిసిల్ల నుంచి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని, పార్కులు ఏర్పాటు చేసి, గ్రీనరీ పెంచాలని కోరారు.

‘రాజన్న’ కార్మికుల సమస్యలు తీర్చాలి



ఏఈవో నవీన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

వేములవాడ: స్థానిక రాజన్న ఆలయంలో కొన్నేళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు తీర్చాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆలయ ఏఈవో ప్రతాప నవీన్‌కు వినతిపత్రం అందించారు. కడారి రాములు, అజ్జ వేణు మాట్లాడుతూ.. కార్మికులకు కాంట్రాక్టర్ ద్వారా కాకుండా నేరుగా దేవస్థానం నుంచే జీతాలు చెల్లించాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, దేవాదాయశాఖ ద్వారా పీఎఫ్, ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ప్రతినెలా 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని విన్నవించారు. కార్యక్రమంలో సంతోష్, మారం విజయ, రేగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలో కేంద్ర మంత్రి ఫొటో లేదని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఫొటో లేదని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించడం లేదని ఆరోపిస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అధికారులు కావాలనే కేంద్రమంత్రి ఫొటో పెట్టలేదన్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులపై వివక్ష చూపడం మానుకోవాలని పేర్కొన్నారు. ఇకముందు ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సురేశ్ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. నాయకులు బాధ నరేశ్, శ్రీనివాసరావు, చిగురు వెంకన్న, కుడుకల జనార్దన్, కల్యాణ్, రమేశ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, తిరుపతి, కార్తీక్‌రెడ్డి, కృష్ణ, రమేశ్, మహేశ్, రంజిత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి



సిరిసిల్ల గీతానగర్‌లో ర్యాలీ తీస్తున్న టీచర్లు

సిరిసిల్లటౌన్: మూడేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్లు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో అమ్మ మాట-అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. 3వ, 5వ వార్డుల్లో ర్యాలీ చేపట్టారు. టీచర్లున్నారు.

ఎల్లారెడ్డిపేట: అల్మాస్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నర్సరీ తరగతిని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు వాణి, కిరణ్మయి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పిల్లల జీవితాలకు పునాది వేసేందుకు అంగన్‌వాడీ సెంటర్లు పని చేస్తున్నాయని తెలిపారు. ప్రాథమిక పాఠశాల టీచర్లు నదియా, లాస్య తదితరులున్నారు.

గంభీరావుపేట: మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. టీచర్లు ఇంటింటికీ వెళ్లి, పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. టీచర్లు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోయినపల్లి: కోరెంలో చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని కోరుతూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రవి, అంగన్‌వాడీ, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ప్రైవేటు స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి అన్నారు. సోమవారం ముస్తాబాద్ మండలం గూడెం మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట నిర్వహించారు. నర్సరీ తరగతిని ఇంగ్లిష్‌లో బోధిస్తారని, పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. టీచర్లు తదితరులున్నారు.

చందుర్తి: మల్యాల గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ ఆధ్వర్యంలో సోమవారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ సెంటర్లలో చేర్పించాలని కోరారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శరత్ చంద్ర, ఉపాధ్యాయుడు ముఖేశ్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.


రుద్రంగి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ తీస్తూ నినాదాలు చేశారు. చిన్నారులను అంగన్‌వాడీ సెంటర్లలో చేర్పించాలని కోరారు. టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో సోమవారం ర్యాలీ చేపట్టారు. టీచర్లు, ఆయాలున్నారు.

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు సోమవారం ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక మాట్లాడుతూ.. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్ల, ధర్మారం, నాగారం, కనగర్తి, మర్తనపేట, కొలనూర్, బావుసాయిపేట గ్రామాల్లో సోమవారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. అంకెలు, బొమ్మలు, ఆటపాటలతో చదువు చెబుతున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ‘సహకార’ లక్ష్యం



రైతులకు చెక్కులిస్తున్న విండో చైర్మన్ కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట: రైతుల సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘం పని చేస్తోందని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, సంఘం అభివృద్ధికి సహకరించాలని సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి కోరారు. ఎల్లారెడ్డిపేట సహకార సంఘంలో సోమవారం ఇద్దరు రైతులకు రూ.9 లక్షల రుణాల చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పెద్ద ఎత్తున రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక స్వావలంబన సాధించాలంటే వ్యవసాయంతోపాటు దాని అనుబంధ రంగాలైన డెయిరీ, గొర్రెలు, పట్టుపురుగులు, కోళ్ల పెంపకం వంటివి చేపట్టాలని సూచించారు. రుణాల మంజూరుకు కృషి చేసిన డీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి సత్తయ్య, డైరెక్టర్లు వెంకట నర్సింహారెడ్డి, నర్సింలు, కార్యదర్శి కిశోర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్, పక్కన నాయకులు

ఎల్లారెడ్డిపేట: సర్కారు బడుల్లో సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గుట్టపల్లి చెరువు తండా, రాచర్ల బొప్పాపూర్ స్కూళ్లలో టీచర్ల కొరత ఉందన్నారు. రాచర్ల గొల్లపల్లిలో 75 మంది విద్యార్థులకు గానూ ఒక్కరే టీచర్ ఉన్నారని తెలిపారు. పిల్లల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. అనేక పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయని, స్వీపర్లు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులే చీపుర్లు పట్టుకొని, ఊడుస్తున్నారని అన్నారు. నాయకులు కొప్పుల నవీన్, శశాంక్, సాయి, అరవింద్, సాయికిరణ్, తరుణ్, ప్రశాంత్, నగేశ్, విష్ణు, భార్గవ్, రమణ, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

✦ కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

గంభీరావుపేట: కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, గంభీరావుపేట మండలశాఖ అధ్యక్షుడు హమీద్ అన్నారు. గోరింటాలకు చెందిన పార్టీ కార్యకర్త కంచర్ల తిరుపతి ఇటీవల మృతి చెందాడు. అతని కుటుంబాన్ని నాయకులు సోమవారం పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి హన్మాండ్లు, నాయకులు రఘువీర ప్రసాద్, అంజయ్య, అమీర్ పాల్గొన్నారు.

✦ బడికి సౌండ్ సిస్టం అందజేత

సిరిసిల్లఎడ్యుకేషన్: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్ రెడ్డి సోమవారం రూ.29 వేల విలువైన సౌండ్ సిస్టం అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ, టీచర్లు పాల్గొన్నారు.

✦ మున్నూరుకాపు పటేల్ సంఘం కార్యవర్గం

గంభీరావుపేట: గంభీరావుపేట మున్నూరుకాపు పటేల్ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయన్నగారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా అక్కపల్లి వెంకటి, గంట శంకర్, ప్రధాన కార్యదర్శిగా గంధ్యాడపు నరేశ్, కోశాధికారిగా గంట రాములు, సంయుక్త కార్యదర్శిగా మేకార్తి అంజయ్య ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

✦ అథ్లెటిక్స్ అసోసియేషన్ సమావేశం

సిరిసిల్లకల్చరల్: అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం సోమవారం సిరిసిల్లలో నిర్వహించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా కనకం శ్రీని వాస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నేరెళ్ల గంగాధర్‌లను ఎన్నుకున్నారు. సంబంధిత నియామక పత్రాలను సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ అందజేశారు.

✦ గౌడ సంఘం నూతన కార్యవర్గం

బోయినపల్లి: తడగొండ గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండారి మహేందర్, గౌరవ అధ్యక్షుడిగా ఉయ్యాల రమేశ్, ఉపాధ్యక్షులుగా ఉయ్యాల బాలాజీ, నేరెళ్ల అనిల్, ప్రధాన కార్యదర్శిగా ఉయ్యాల బాలరాజు, సంయుక్త కార్యదర్శిగా జాగీరు లక్ష్మీపతి, కోశాధికారిగా చింతలకోటి మహేశ్ ఎన్నికయ్యారు.

✦ 20న శ్రీవైష్ణవ సంఘం రజతోత్సవం

సిరిసిల్లటౌన్: శ్రీవైష్ణవ సంఘం రజతోత్సవాన్ని ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మదిగంటి శ్రీకాంత్ తెలిపారు. సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి డింగరి శ్రీనివాసాచార్యులు, చిగురాల శ్రీనివాసాచారి, నమిలికొండ నర్సింహాచారి, మోహనమూర్తి, వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

✦ రక్తహీనత నివారణపై శిక్షణ

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో వేములవాడ అర్బన్, రూరల్ మండల ఉపాధ్యాయులకు సోమవారం రక్తహీనత నివారణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో రక్తహీనతను గుర్తించి, వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలని మండల రిసోర్‌పర్సన్లు రామ్‌గోపాల్, సంతోష్ సూచించారు.

✦ గీత కార్మికుడికి గాయాలు

వేములవాడ రూరల్: వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని కోనాయిపల్లికి చెందిన దుర్గం రామస్వామి అనే గీత కార్మికుడు సోమవారం తాటిచెట్టు పైనుంచి పడి, తీవ్రంగా గాయపడ్డాడని స్థానికులు తెలిపారు. తోటి కార్మికులు అతన్ని ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

✦ 32వ సారి రక్తదానం

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణానికి చెందిన ఓ మహిళకు రక్తం అత్యవసరం కావడంతో 27వ వార్డు కౌన్సిలర్ గోలి మహేశ్ సోమవారం ఇచ్చి, ఆదుకున్నారు. ఇప్పటివరకు 32 సార్లు రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు.

✦ ఇంటి స్థలం చూపించాలి

రుద్రంగి: తమకు ఇంటి స్థలం చూపించాలని రుద్రంగివాసులు కోరారు. సోమవారం తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. ఎల్లంపెల్లి ఎత్తిపోతల పథకంలో భాగంగా రుద్రంగి మండల కేంద్రంలో తీసిన కాలువలో తాము ఇంటి స్థలం కోల్పోయామన్నారు. అప్పటి ఎమ్మెల్యే ఇంటి స్థలం కేటాయిస్తూ పట్టాలు ఇచ్చారని తెలిపారు. కానీ, ఇప్పటి వరకు స్థలం చూపించలేదని పేర్కొన్నారు.

✦ హక్కులపై అవగాహన కల్పిస్తాం

సిరిసిల్లకల్చరల్: సీనియర్ సిటిజన్ల హక్కులపై అవగాహన కల్పిస్తామని, ఇందుకోసం క్రమం తప్పకుండా సదస్సులు నిర్వహిస్తామని సీనియర్ సిటిజన్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చేపూరి బుచ్చయ్య, జనపాల శంకరయ్య తెలిపారు. సోమవారం సిరిసిల్లలోని సంఘం కార్యాలయంలో సహచర సభ్యుడు మాణిక్‌రావు లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. సంఘం ప్రతినిధులున్నారు.

✦ కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని 17వ వార్డులో కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ సోమవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, నాయకులు పాల్గొన్నారు.

✦ ‘వృత్తి విద్య-భవిష్యత్‌కు బాట’

వీర్నపల్లి: మండల కేంద్రంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విశ్వనాథం ఆధ్వర్యంలో సోమవారం వరల్డ్ యూత్ స్కిల్ డే కార్యక్రమం నిర్వహించారు. మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి వృత్తి విద్య-భవిష్యత్‌కు బాట అనే నినాదంతో ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జనరల్ ఎడ్యుకేషన్‌తోపాటు ఒకేషనల్ కోర్సులు చదివితే జీవితంలో తొందరగా స్థిరపడచ్చని తెలిపారు. కంప్యూటర్స్, బ్యూటీషియన్, వెల్‌నెస్ కోర్సులు నేర్చుకుంటున్న 9 నుంచి 12వ తరగతి విద్యార్థులు తయారు చేసిన వివిధ నిర్మాణాలు ఆకట్టుకున్నాయి.

✦ నోట్‌బుక్స్ పంపిణీ

చందుర్తి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు వార్డెన్ రవీంద్రస్వామి సోమవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

✦ లేబర్ కార్డుదారులకు వైద్య పరీక్షలు

తంగళ్లపల్లి: లేబర్ కార్డు కలిగిన కార్మికులకు సోమవారం తంగళ్లపల్లిలో ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. రక్త నమూనాల ఫలితాల ఆధారంగా వైద్య సేవలందిస్తామని వైద్య సిబ్బంది పేర్కొన్నారు.

చేనేత ఐక్యవేదిక అధ్యక్షురాలికి సన్మానం

సిరిసిల్లటౌన్: చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు గుజ్జె తార డాక్టరేట్ పొందడంపై సిరిసిల్ల పద్మశాలీ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పద్మశాలీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత ఆధ్వర్యంలో ఆమెను సన్మానించారు. సంఘం పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, నాయకులు చక్రపాణి, సత్యం, అరుణ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

✦ ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులను నియంత్రించాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, మొబైల్ యాప్‌ల పేరిట అదనపు చార్జీలు వేస్తున్నారని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మానుక కుమార్‌యాదవ్ ఆరోపించారు. ఫీజులను నియంత్రించాలని కోరుతూ సోమవారం ఎమ్మార్వో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.


‘కల్యాణలక్ష్మి’ తులం బంగారం ఎక్కడ?

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టినట్లు కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఎక్కడని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. సోమవారం రాచర్లగొల్లపల్లిలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ల్యాగల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండల కో–ఆప్షన్ సభ్యుడు జబ్బార్, గ్రామశాఖ అధ్యక్షుడు అందె సురేశ్ మాట్లాడారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కేవలం చెక్కులు పంపిణీ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని అన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

వీర్నపల్లి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించడం, నాణ్యతతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం, ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించడం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

మత్తు పదార్థాల గుర్తింపునకు తనిఖీలు



వేములవాడ: గంజాయి వంటి మత్తు పదార్థాలను గుర్తించేందుకు పోలీసు జాగిలాలను రంగంలోకి దింపినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలతో సోమవారం వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్, పాన్, కిరాణా దుకాణాలు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అక్రమార్జనే ధ్యేయంగా, యువత భవిష్యత్తును నాశనం చేస్తూ గంజాయి రవాణా చేసే వ్యక్తులను పట్టుకునేందుకు వాహన తనిఖీలూ చేపడుతున్నామన్నారు. మత్తు పదార్థాలు నిల్వ చేసినట్లు, విక్రయిస్తున్నట్లు తెలిస్తే డయల్ 100తోపాటు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.